

# వాణ్ణి రానివ్వకండి!!

కె. రామలక్ష్మి



'శాంతి నిలయం' సాయంత్రం ఐదు గంటల తరువాత - కుంభకర్ణుడు సడెన్‌గా మేల్కొన్నంత హడావుడిగా వుంటుంది! ఎందుకంటే అది అక్కడ వుండే ముసలివాళ్లని వాళ్ల వాళ్ల సంతతి, స్నేహితులు, బంధువులూ చూడవచ్చే సమయం. 'ఏమిటో ఆ పిచ్చి ఎదురుచూపులు' అని ఆ టైమ్‌లో వాళ్లని చూసిన ప్రతిసారీ నేను అనుకుంటూనే వుంటాను. ఇంట్లో వుంచుకోలేక, వారిచేత పనిపాటలు చేయించుకోలేక - ఈ నిలయంలో చేర్చి విశ్రాంతిగా ఎవరి సంసారాలు వాళ్లు యీదుకుంటున్నా కన్న పిల్లల కోసం కళ్లు కాయలు కాసేలా ఎందుకు ఎదురు చూడడం? అర్థం కాదు నాకు.

'చాకిరి చేయలేనురా. నాకు ఓపిక వుడిగిపోయింది' అని వాపోయే తల్లికి విశ్రాంతి నివ్వలేని కొడుకులూ, కోడళ్లూ, ఒకరేమిటి బాధ్యత వహించవలసిన అందరూ. 'అయితే ఎందుకు! ధైర్యంగా ఇల్లు తాళం పెట్టి, పిల్లల్ని అటూ, మేం ఇటూ స్కూళ్లకు ఉద్యోగాలకీ పోడానికి కూడా లేకుండా' అని ఓ నిర్ణయానికి వచ్చి - 'ఇంట్లో వుంచుకునే భారం కంటే - ఏ బాధ్యతా అక్కరలేని యీ ఆశ్రమంలో చేరిస్తే నెలకింత డబ్బు యిచ్చేస్తే పోయె మనకీ విశ్రాంతి. వాళ్లకీ విశ్రాంతి అనుకుంటారో ఏమో - చాలా మంది నిశ్చింతగా వుండడానికి తల్లులనీ విశ్రాంతి నిలయంలో వదలివెడుతూ వుంటారు. లోకం ఉట్టి కోడి! దేనికైనా కూస్తుంది. అందులో, కన్న దాన్నిలా వదిలించుకుంటే ఇల్లెక్కి మరీ కూస్తుందనో ఏమో, ఎలాగో అలా వారంలో ఒకసారో రెండుసార్లో వచ్చి ముళ్ల మీద కూర్చున్నట్టు కూర్చుని చక్కా పోతూంటారు రక్తం పంచుకు పుట్టిన వాళ్లు! విజిటింగ్ టైము ఇక్కడ చాలా ఆసక్తి జనకంగా వుంటుంది, పరిశీలించి చూడడానికి.

'ఏమిటో వాళ్ల ఇబ్బందులు వాళ్లూ' అని సర్దుకునే వాళ్లు వుంటారు. 'తల్లిని ఇలా ఇక్కడ తగలెట్టాం సరే. చూడ్డానికొచ్చేప్పుడు కాయోపండో బిస్కటు పాకెట్లో పట్టుకొస్తే ఏం పోతుంది? దానికీ - వీడికి పెళ్లాం పర్మిషన్ కావాలి.' అని వాపోయే వాళ్లు కొందరు, ఎన్నిరకాల మనస్తత్వాలో...... ఎన్నో రకాల నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సత్యాలుగా అనిపిస్తూంటారు నాకు వీళ్లు!

నాకక్కడ చాలా మందితో పరిచయం వుంది. సంఘ సేవికగా పిచ్చి వాళ్లతో పనిచేశాను - కొన్నాళ్లు. అప్పుడు కూడా చవి చూడని, వినిపించని విషాద రాగాలీ వృద్ధులలో నేను చూశాను. ఆశ్చర్యం వేసేదేమిటంటే - ఏ తల్లీ కొడుకుని తప్పు పట్టకపోవడం. 'అంతా దాని మహత్యం! వాడేం చేస్తాడు? అది ఆడించినట్టు ఆడతాడు' అని కొడుకుల్ని వెనకేసుకొస్తారు! జీవిత సంధ్యా సమయంలో ఆలోచించవలసినవి గడిచిన, తిరిగి రాని అనుభూతులనా? ఈ ఇష్టాఇష్టాల బేరీజు వేయడాన్నా? నాకర్థం కావడం ఎప్పుడో మానేసింది... ఇక్కడ నేను ప్రశాంతంగా వున్నాను. నన్నెవరూ చూడరానక్కర లేదు. వస్తే అదొక రోజంతా మనస్సుని వేధిస్తుంది. 'అనుకునే ఓ అవిడ మాట విన్నప్పుడు - "మీకు మీ కొడుకు రావడం ఇష్టం లేదా?" నమ్మలేనంత ఆశ్చర్యంతో అడిగానొకరోజు.

'అక్కర్లేదు. నాకెవరూ లేరని హాయిగా వుండకుండా ఈ పరామర్శ లెందుకు! అసలెందుకూ రావడం? ప్రేమ ఒలక పోయడానికా? ఇంకా ఎన్నాళ్లిలా బ్రతుకుతానో రోజులు లెక్కవేయడానికా?" ఎదురడింగిదామె.

"ఛ.ఛ. ఏదో ఇంట్లో అటు పెళ్లాం మాట తీసేయలేకో మీకు సదుపాయంగా లేదనో ఇక్కడ చేరుస్తాడు గాని మీ అబ్బాయికి మీ మీద అభిమానం లేక అని ఎందుకు అనుకుంటున్నారు!' సర్ది చెప్పబోయానొక రోజు, ఆవిడ నా మాటకి చాలా నొచ్చుకున్నట్టుంది - తటాలున లేచి గదిలోకి వెళ్లి పోయి తలుపేసుకుంది. నా కళ్లని నేను నమ్మలేక పోయానా రోజు. కాని కొద్ది వారాల తరువాత - ఒక గమ్మత్తయిన దృశ్యం - కాదు - సంఘటన అనాలేమో - నా కళ్లు తెరిపించింది.

✦✻✦✻✦✻✦✻

చాలా మంది చెప్పారు - సరిగ్గా విజిటింగ్ టైము ప్రారంభం కాగానే ఆవిడ గప్‌చిప్‌గా గదిలోకి పోయి తలుపు గడియ పెట్టేసుకుంటుందని 'అదేమిటి, ఓ కొడుకు ఈ ఊళ్లో వున్నాడుగా' అడిగాను.

"వాడిని చూడకూడదనే ఆమె తలుపేసుకుంటారు" అని చెప్పారు.

ఒక రోజు నేను సాయంత్రం వెళ్లి బాతాఖానీ కొడుతున్నా అందరితోటి. సాధారణంగా ఉదయం పూట నాకు సులభంగా వుంటుంది. ఇలాంటి చోట్లకి వెళ్లి కాస్త ఆ పనీ ఈ పనీ చేసి పెట్టడానికి. పిల్లల్ని స్కూలుకీ, ఆయనగార్ని ఆఫీసుకీ పంపేశాక నాకు చాల్లా ఫ్రీ టైమ్ వుంటుంది. నాకీ వంటల పిచ్చి, ఇల్లు ఏదో సినిమా సెట్‌లాగా అలంకరించాలన్నా పిచ్చీ చాలా తక్కువ. నేను రాసుకుందుకు కూర్చునే చోట చిన్న వాజ్‌లో అప్పుడే కత్తిరించిన తులసి కొమ్మలు పెట్టుకుంటాను. నాకెంతో బాగుంటుంది. అదీ ఆయన రాసుకునే చోట కింద పడ్డా ఏం కానివి పెట్టాలి. ఆయన గారికి నా టేబిల్ లాగా అందంగా కనబడాలి కాని చేతితో పరిచే కాగితాలకీ - తెరచి వుంచే పుస్తకాల దొంతర్లకి ఏం అడ్డు రాకూడదు!

ఇంటి పనీ వంట పనీ బాగా సింప్లిఫై చేసేయడం నేర్చుకున్నాను. వడ్డించేప్పుడు ఎవరి ముఖం చూడను - ఎలాంటి భావాలు ఎదుర్కోవాలో నని! కాని వాళ్లూ నేర్చుకున్నారు.... ఈ పద్ధతిని. ఎప్పుడేనా ఎవరేనా ఏమేనా అనడానికి ముందే. 'నాకంటూ కాస్త టైం కేటాయించుకోడం నేరమా ఏమిటి?' అని ఎదురు ప్రశ్నవేసి వాళ్ల ప్రశ్నలు వాళ్లే మింగేసుకునేలా చేసేస్తూ వుంటాను... అందుకే 'మన మమ్మీ - పిక్యులియర్, అందరిలాంటిదీ కాదు కదా డాడీ' అంటూ ముద్దుల కూతురు తండ్రితో చెప్తుండడం విని - హమ్మయ్య' అనుకుని తేలికగా నిట్టూర్చేశాను - దేనికో ఎదురు చూసేకంటే అలా తేల్చుకోవడం సుఖం!

అప్పటకే విజిటర్స్ హాలు కలకల్లాడుతోంది. బోసి నవ్వులు చిందించే బొమ్మల నుండి ఇంకా నడివయస్సు కూడా దాటనట్టు కనబడే వాళ్ల దాకా... ఎంతో సరదాగా వీధి వాకిలి కేసి చూస్తున్నారు... సుబ్బలక్ష్మి గారు కూడా అందరి మధ్యా తిరుగుతూనే ఓ క్షణం కనబడ్డారు. మరుక్షణంలో పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ అడ్డొస్తున్న వాళ్లని ఇటూ అటూ తోసేస్తూ గది కేసి పారిపోతున్నట్టు కనిపించారు. ఆమె వెనకనే ఆమెలాగే వేగంగా నడుస్తూ ఓ పాతికేళ్ల యువకుడు పరుగెట్టాడు. నేను బిక్కపోయి చూస్తూన్నానా దృశ్యం.

ఆమె తలుపు మూసుకునే లోపల ఆ అబ్బాయి బూటుకాలు అడ్డుపెట్టి తలుపు మూయనియ్యకుండా ఒక్క తోపు తోసి లోపలికి జొరపడ్డాడు. తలుపు ధభాలున మూసి గడియ పెట్టేశాడు.

అక్కడి స్థిరనివాసులకంటే వచ్చినవాళ్లు ఈ దృశ్యం చూసి భయపడి పోయారు. గుమ్మం ముందు నిలబడి దబదబ తలుపు బాదుతూ, "ముందు తలుపు తెరువు. లేకపోతే వార్డెన్ చేత పోలీసులకి ఫోనుచేస్తా'నంటూ ఒక తను అరిచాడు

బదులుగా తలుపులు తెరుచుకో బడలేదు గాని లోపల కేకలు గోల ప్రారంభమైంది. దేన్ని గురించి దెబ్బలాడుకుంటున్నారో ఓ పట్టాన ఎవరికీ అర్థం కాడం లేదు.

'ఏమిటండీ ఈ దౌర్జన్యం. మా అమ్మ ఇక్కడ చాలా సేఫ్‌గా వుంటుందని వుంచాను... ఇదంతా చూస్తూంటే ఏదో భయంగా కూడా వుంది' అంటున్నాడొక నడివయస్కుడు. బట్టతల వచ్చేసింది. చత్వారపు కళ్లజోడు వచ్చేసింది. బహుశా పెద్ద కూతురికో కొడుక్కో పెళ్లి పెడాకులూ చేసే వుంటాడు.... కాని.... తల్లి ఇంట్లో సేఫ్‌గా వుండదని ఇక్కడ చేర్చేసినట్టున్నాడు!... ఒక ముసలావిడ అతని మాటలకి కాస్త నవ్వి 'ఫరవాలేదయ్యా. ఆ కుర్రాడు నీలాగా ఓ కొడుకే. తల్లితో ఏదో తేల్చుకోవాలని చాలా రోజుల నుంచి ఆరాట పడిపోతున్నాడు... పాపం ఈ రోజు సుబ్బలక్ష్మి కాస్త ఆలస్యం చేసి దొరికిపోయింది. లేకుంటే తలుపుల్నే తిట్టి బాది చక్కా పోయేవాడులే' అని బట్టతల కొడుగ్గారిని ఓదార్చింది.

'అయినా ఇదేం ఘోరం?' తలుపు తెరిపించి తీరాలండీ ఆవిడగార్ని పీక నొక్కి చంపితే... పెద్దది. ఏం చేస్తుంది. 'అన్నాడింకొకాయన.

లోపల దూరిన యువకుడు కాస్త అరవడం ఆపి తలుపు ఓ నాలుగంగుళాలు తెరిచి 'మీరేం భయపడకండి - నేను దాన్ని చంపను. నేనో సంగతీ రోజు తేల్చుకు తీరాలి. ఇన్ని నెలలుగా దొరకడం లేదు?' అంటూ మళ్లీ తక్షణం తలుపు లోపల గడియ వేసేశాడు.

ఇవతల గుమి గూడిన వాళ్లలో ఓ గుసగుసల తరంగం లేచింది. దరిచేరకుండానే..... అలా ఒకదాని మీద ఒకటి లేచి ముంచెత్తుతూంది వాతావరణం.

చూస్తోండగా చీకట్లు అలుముకున్నాయి. వార్డెన్ కార్యాలయంలో గంట కొట్టారు. 'చూడ వచ్చిన వారిక బయలుదేరి ప్రయత్నాలు చేయవచ్చు'నన్నట్టు... చాలా మంది లేచారు గాని వాళ్ల ముఖాలింకా కుతూహలం - లోపల దూరిన యువకుడు వస్తాడా? అప్పుడే రాడా అన్న సంధిగ్ధంలో పడి అక్కడ నుంచి కదల నీయడం లేదు! కాని వారి సరదా తీరలేదు. కుర్రాడు బయటికి రాకుండానే... మూడో గంట కూడా కొట్టేశారు. వార్డెన్ గారు ఆఫీసు వదిలి గదుల కేసి రావడం ప్రారంభించారు.

సుబ్బలక్ష్మి గది ముందాగి తలుపు తట్టి 'మర్యాదగా బయటికి రావయ్యా, లేకుంటే గుర్ఖాను పిలిచి బయటికి గెంటించడమే కాదు.... ఇక నిన్ను గేటులోకి రానివ్వద్దని చెప్పవలసి



## ఐ.సి.డబ్ల్యు.ఎ (ఇంటర్)లో జాతీయ ర్యాంకు సాధించిన రేఖ

కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కె. రాఘవేంద్రరావు, రమాదేవిల పుత్రిక కుమారి రేఖ గత జూన్‌లో జరిగిన ఐ.సి.డబ్ల్యు.ఎ. (ఇంటర్) పరీక్షలో అఖిల భారత స్థాయిలో మూడవ ర్యాంకు సాధించారు. రాష్ట్రంలో ఆమెకి ప్రథమ స్థానం. గతంలో సి.ఎ. ఫౌండేషన్ కోర్సులో కూడా రేఖ జాతీయ స్థాయిలో 19వ ర్యాంకు (స్టేట్‌ఫస్ట్) సాధించారు. సి.ఎ., ఐ.సి.డబ్ల్యు.ఎ కోర్సులకు విజయవాడ 'సూపర్‌విజ్'లో శిక్షణ పొందిన రేఖ, అందునా కేవలం 19 ఏళ్ళ వయస్సులోనే ఐ.సి.డబ్ల్యు.ఎ. (ఇంటర్) పూర్తి చేసి జాతీయ ర్యాంకు సాధించటం విశేషం.

సి.ఎ. ఫౌండేషన్ కోర్సులో జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన రేఖకు జాతీయ అంతర్జాతీయ సంస్థల ఆడిట్ వ్యవహారాలను చూసే ప్రముఖ సంస్థ ఫెర్గుసన్ అండ్ కంపెనీ (బొంబాయి) నుండి అవకాశం లభించడం ఆమె ప్రతిభకు నిదర్శనం.

వుంటుంది'' అన్నారు సౌమ్యంగానే.

కుర్రాడు పోరాడి అలసిపోయిన యోధుడి లాగా క్రాపులో వేళ్ళుంచి పైకి తోసుకుంటూ తలుపు తెరచి వార్డెన్ ముఖంలోకి సూటిగా చూస్తూ 'ఈ రోజు కాకుంటే రేపు! రేపు కాకుంటే ఎల్లుండి!... ఎప్పుడో ఒకప్పుడిది - చెప్పి తీరా లండీ... మీకు తెలుసా? నా తండ్రి ఎవరో నాకు తెలియదు? ఈ దారుణం మీరు వూహించగలరా?' అనేసి పరుగులాంటి నడకతో గుమ్మందాటి చక్కా పోయాడు వార్డెన్. పక్కనే నిలబడ్డ నేను అతని మాటలని నిర్ఘాంతపడి పోయాను. 'ఇదే మిటి... అరవయ్యో పడి దాటిన ఈ తల్లి శీలాన్ని ఈ కుర్రకుంక శంకిస్తున్నాడు?' అడిగాను. నా ప్రశ్న నాకే వింతగా వినిపించింది. సుబ్బలక్ష్మి గారు గదిలో మంచం మీద కూర్చుని వున్నారు. ఆమె జుట్టు చిందర వందరగా వుంది. కాస్త దగ్గిరగా తీసుకుని ముడి వేసుకునే ప్రయత్నంలో వుందామె. ముఖం కోపంతో అసహనంతో కంది పోయినట్టుగా వుంది. 'కొంప తీసి జుట్టు పట్టుకు కొట్టలేదుకదా! తల్లిని' అనుకున్నాను మనస్సులోనే.

"ఏమైందండీ! దెబ్బలేం తగలలేదు కదా?" అడిగాను ఆమె మోచేతి మీద చిన్న రక్తం మరక చూసి.

"వెధవ తోసేస్తే... గోడకి చెయ్యానింది" అంది కాస్త నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆమె మనస్సు అంత గట్టిగా ఎలా వుంది? ఏ కొడుకైనా తల్లిని పట్టుకుని 'నా తండ్రి ఎవడు? చెప్పు'' అని నిలదీస్తే కృంగి కుమిలి కుమిలి ఏడవడం లేదా? ఎందుకామె ఇంత మొండిగా వుంది! వుండ కల్గింది? ఏమిటో పిచ్చి ప్రశ్నలు. ఓ ముసలి తల్లి శీలానికి పరీక్ష పెట్టే కొడుకుల రోజులూ వచ్చేశాయి అన్న ఆశ్చర్యం నన్ను ముంచెత్తింది.

'కూర్చోండి' అంటూ కుర్చీ చూపెట్టింది.

నేను కూర్చున్నాను. వార్డెన్‌గారు - అందరు విజిటర్స్ వెళ్లారా లేదా అని చూడడానికి బయలు దేరిపోయారు.

"కొందరైతే తల్లికి అన్నం కారియర్ వచ్చేదాకా కూర్చుని అది కాస్తా తిని చక్కా పోయే వాళ్లుట! అందుకే వార్డెన్ అందరూ వెళ్లేదాకా డిన్నర్ - రానివ్వరు'' అంది సుబ్బలక్ష్మి గారు నెమ్మదిగా.

"మీ అబ్బాయి అలా అడిగితే మీకు బాధగా లేదా?' అడగకూడదనుకుంటూనే అడిగాను.

"అందుకే కదండీ వాడిని రానివ్వకండి అని చెప్పి చెప్పి, నా ప్రాణం విసిగి పోయింది. స్వర్గాని కెళ్లినా సవతి పోరు తప్పలేదన్నట్టు.... ఇక్కడ కూడ ప్రశాంతంగా వుండనివ్వడం లేదాదరిద్రుడు. ఎం.బి.ఏ. దాకా చదివించాను. మంచి ఉద్యోగం లో వున్నాడు... వీడూ ఏదైనా దూరంగా వున్న చోటికి పోతే బాగుండుననిపిస్తూంటుంది నాకు. చాలా నిర్లిప్తంగా అంటున్న ఆమె ముఖం కేసి పరీక్షగా చూశారు. దాన్లో ఏ విధమైన రాగాను రాగాల తాలూకు ఛాయలైనా కనిపించడం లేదు.

"మీకు ఇంకా పిల్లలున్నారా?'' ఆశ్చర్యంగా అడిగాను.

"వాడు మూడో వాడు. వీడి ఐదో ఏట వారు పోయారు. పెంచి పెద్ద చేశాను...'' చాలా నెమ్మదిగా అంటున్న ఆమెని - చెప్పనీ అన్నట్టు వ్యవధి ఇచ్చాను.

"ఏమిటో వయసు పెరగను పెరగను వీడిలో ఎవరు నాటారో విషబీజాలు... మా అత్తగారు ఆడ బిడ్డలు మాతోనే వుండేవారు.... వాళ్లు వీడిని ముద్దు చేసి పెంచారు. నేను ఉద్యోగం చేసేదాన్ని... పెద్ద ఉద్యోగం కాదు. కాలక్షేపాని కన్నట్టు... వీడు పెద్దయి ప్రయోజకుడై ఇలా నన్ను నిలదీస్తాడని నేనెప్పుడూ వూహించలేదు! అలా వూహించి వుంటే - ఇప్పుడాడపిల్లని తెలుసుకుని భ్రూణ హత్యలు చేస్తున్నట్టు అప్పుడే వాడిని చంపేసి వుండే దాన్ని!.... ఎందుకిప్పుడు వాడికి! తల్లి చెప్తేనే కదండీ - ఏ బిడ్డకైనా 'వీడు నీ తండ్రి' అని తెలిసేది?'' నిట్టూర్చారామె...

ఆమె మనో నిబ్బరానికి నాకు చాలా గర్వం అనిపించింది. "ఇప్పుడెందుకింత పట్టు పడుతు న్నాడు? ప్రత్యేకంగా ఏదైనా కారణం వుందా?'

"నేనా మధ్య ఇల్లు అమ్మేశాను. డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా వేసుకున్నాను. బ్రతికున్నన్నాళ్లు నేను తినాలి కదా?''

'పోనీ కొంత అబ్బాయికిచ్చేయ లేకపో యారా?' మామూలుగా అడిగాను.

"ఎందుకివ్వాలి? అది నా ఇల్లు. నాకు దాని మీద సర్వ హక్కులు వున్నాయి. ఇలాంటి వెధ వకి కానీ ఇవ్వక్కరలేదండీ నేను!'' చాలా ఆవేశంగా అన్నారు సుబ్బలక్ష్మి. "ఈ న్యూసెన్స్ వుండదేమో నని?'' నెమ్మదిగా అన్నాను. "ఉండనీయండి. వాడి అనుమాన నివృత్తి చేయవలసిన అవసరం నాకు లేదు. అయినా నేనెందుకు చెయ్యాలి? "ఇల్లు ఎవడిచ్చాడు నాకు?'' అన్నాడు. అమ్మి పారేశాను. ఏం చేసి సంపాదించావని అడిగాడు. "వ్యభిచారం చేసి అన్నా.''

"ఛఛ'' అన్నా నొచ్చుకుంటూ.

"తప్పేముంది? భర్తతో చేస్తే సంసారం. పది మందితో చేస్తే వ్యభిచారం. అంతేగా. ఇల్లునాకు న్నంత మాత్రాన కడుపున పుట్టిన పిల్లలు ఇలా అడగవచ్చా. అలా అడిగాక... నిజం చెప్పవలసిన అగత్యం అస్సల్లేదు నాకు. బుర్ర బాదుకు చావ నివ్వండి. నాకేం పోలేదు. వాడ్ని రానివ్వకుండా వుంటే చాలు నాకు, అంతే' అంటూ మంచం నుంచి లేచారు సుబ్బలక్ష్మి.

"సారీ మీ మనసు నొప్పించానేమో, అసలే మీ అబ్బాయి.''

"వాడిని నేను కొడుకనుకోవడం ఎప్పుడో మానేశాను. మీరేం బాధపడకండి! నా డబ్బు మంచిదే. నేను.... నేను మటుకు మంచి దాన్ని కాదా? ఈ లక్షలు వాడి ముఖాన కొట్టేస్తే నాకు వాడిచ్చిన బిరుదుపోతుందా? పోదే. అందుకే వాడికి - పెద్ద శిక్ష - నేను వాడడిగిన దానికి సమా ధానం చెప్పక పోవడమే అని గుండె రాయి చేసు కుని బ్రతికేస్తున్నా...'' అలమార కేసి నడిచారు స్నానానికి ప్రయత్నం కాబోలు - అనుకుంటూ లేచాన్నేను...

'నేను వెళ్లి వస్తా....' అన్నా, నా కంఠస్వరం నాకే నూతిలోంచి వస్తున్నట్టుగా విన్పిస్తూంది...

"మీరేనాడు చూసిన దాన్ని గురించి బాధపడ కండి. మీరిక్కడికి వచ్చి ఎంతో చేస్తున్నారు... ఇలాంటి వాళ్లు కూడా వున్నారని మీ లాంటి వాళ్లకి తెలియడం చాలా అవసరం అని నేను అనుకుంటాను అంటూ నేను తలుపు దాటగానే తలుపు వేసుకుందామె.

నేను తేరుకుని బయటపడే సరికి తొమ్మిది గంటలవుతోంది.... రోడ్డు మీద నిలబడ్డా ఆటో ఏదైనా దొరుకుతుందేమోనని... పక్కనే స్కూట రొచ్చి ఆగింది "ఏమిటీ ఈ రోజు సాయంత్రం, విజిట్ ఆలస్యం అయింది కదా అని తీసుకెళ దామని వస్తున్నా... లోకం మరిచి ఖాళీ ఆటోలు కూడా వదిలేశారు... వాట్ హేపెండ్!' అన్నారు. వెనకగా ఎక్కి కూర్చుని ఆయన భుజం మీద చేయి వేసి "నాకే తెలియడం లేదండీ' బుర్రంతా బ్లాంక్ అయిపోయింది. ఓ తల్లి ఓ కొడుకుని వాడ్ని రానివ్వకండి' అంటూ హెచ్చరించడం విని'' అన్నా - సగం స్వగతంగా.

స్కూటరు ధ్వనిలో నామాట విన్నారా లేదో కూడా తెలియలేదు నాకు.



### శబ్ద కాలుష్యం

ఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ జరిపిన ఒక సర్వేలో బొంబాయి, ఢిల్లీ, కలకత్తాలు ప్రపంచంలో శబ్ద కాలుష్యం అధికంగా గల మొదటి పది నగరాల్లో చోటు చేసుకున్నాయి. బొంబాయిలో రోజూ 70 డెసిబల్స్ శబ్దం వినిపిస్తూ వుంటుంది. పండగ రోజుల్లో అయితే 90 డెసిబల్స్ వరకూ పెరుగుతుందా శబ్దం. మనిషి చెవులకి ప్రశాంతత 45 డెసిబల్స్ శబ్దం దగ్గర వుంటుంది. అది దాటితే వేదనే!

-డి. పద్మజ